ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 13 ఏప్రిల్ 2024

రైతులకు బోనస్ ఇవ్వకుంటే ఊరుకోం
- ఎంపీ బండి సంజయ్ కుమార్ - 7లో..

అసంపూర్తిగా రక్షణ చర్యలు
- నాంపల్లి గుట్టపై ప్రమాదకరంగా ఘాటు రోడ్డు - 8లో..

రుణ పరిమితి ఖరారు





- 124 పంటలకు వర్తింపు • ఈసారి స్వల్పంగా పెంపుదల
- వరికి రూ.45 వేలు, పత్తికి రూ.21 వేల పరిమితి
- 2023-24 వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.2134 కోట్లు
- ఇచ్చింది రూ.1293 కోట్లు
- 2024-25 ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.2137 కోట్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే పంట రుణాల పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ప్రణాళికను ఖరారు చేశారు. రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయం మేరకు 124 పంటలకు సంబంధించి రుణ పరిమితిని పెంచారు. గతేడాదితో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటల్లో కొన్ని పంటలకు మాత్రమే స్వల్పంగా పరిమితి పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఈసారి వరి, కంది, మొక్కజొన్న, మినుములు, పెసర, శెనగ, జొన్న తదితర పంటలకు రుణ పరిమితి పెంచలేదు. పత్తి సాగుకు వెయ్యి రూపాయలు మాత్రమే పెంచారు. గతేడాది రూ.45 వేల వరకు ఉండగా ఈ సారి రూ.46 వేలకు పెరిగింది. పాడి రైతులకు డెయిరీ పెట్టుకోవడానికి ఒక గేదె కొనుగోలుకు రూ.33 వేలను ఇవ్వాలని సూచించారు. గొర్రెలు, మేకలు కొనుగోలుకు సంబంధించి రూ.24 వేలు, ఒక్కో కోడిపిల్లకు రూ.190 చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకర్లు రుణ లక్ష్యాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రెడిట్ ప్లాన్‌కు సంబంధించి 2023-2024 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా రూ.2981.68 కోట్లు ఉన్నా డిసెంబరు వరకు రూ.2224 కోట్లు అందించారు. ఇందులో వ్యవసాయానికి సంబంధించి రూ.2134.2 కోట్లు లక్ష్యంగా ఉండగా రూ.606.56 కోట్లు ఇచ్చారు. షార్ట్ టర్మ్ లోన్‌లు రూ.686.65 కోట్లు, టర్మ్‌లోన్‌లు రూ.513.66 కోట్లు ఇచ్చారు. ఈ సంవత్సరం క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.3203.60 కోట్లు కాగా వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.2137.42 కోట్లు పెట్టుకున్నారు.

పంటల రుణపరిమితి ఇలా (రూపాయల్లో)

పంట పేరు	2022-2023	2023-2024	2024-2025
వరి	36,000 - 40,000	42000 - 45000	43,000 - 45,000
వరి విత్తనోత్పత్తి	42,000 - 45,000	46000 - 50000	48,000 - 50,000
పత్తి	38,000 - 40,000	42000 - 45000	44,000 - 46,000
జొన్న	16,000 - 18,000	17,000 - 19,000	17,000 - 19,000
జొన్న విత్తనోత్పత్తి	22,000 - 25,000	22,000 - 25,000	24,000 - 26,000
మొక్కజొన్న	28,000 - 32,000	30,000 - 34,000	32,000 - 34,000
కంది	18,000 - 21,000	21,000 - 24,000	22,000 - 24,000
మినుములు	18,000 - 21,000	18,000 - 21,000	19,000 - 21,000
పెసర్లు	18,000 - 21,000	19,000 - 22,000	20,000 - 22,000
సన్ ఫ్లవర్	22,000 - 24,000	26,000 - 29,000	27000 - 29,000
సోయాబీన్	24,000 - 26,000	26,000 - 28,000	28,000 - 30,000
వేరుశెనగ	26,000 - 28,000	28,000 - 30,000	28,000 - 30,000
ఆముదం	18,000 - 20,000	18,000 - 20,000	19,000 - 21,000
మిర్చి	65,000 - 75,000	70,000 - 80,000	82,000 - 84,000
టమాట	44,000 - 50,000	50,000 - 55,000	53,000 - 55,000
క్యారెట్	28,000 - 30,000	30,000 - 32,000	32,000 - 34,000
ఆయిల్ పాం	40,000 - 42,000	40,000 - 42,000	42,000 - 44,000
నిమ్మకాయ	42,000 - 44,000	45,000 - 50,000	45,000 - 50,000
వంకాయ	45,000 - 48,000	50,000 - 53,000	53,000 - 55,000
ఉల్లిగడ్డ	37,000 - 42,000	40,000 - 45,000	43,000 - 45,000
క్యాబేజీ	30,000 - 32,000	32,000 - 34,000	33,000 - 35,000
కాలీ ఫ్లవర్	30,000 - 32,000	32,000 - 34,000	33,000 - 35,000
కొత్తిమీర	18,000 - 22,000	22,000 - 25,000	23,000 - 25,000
మునక్కాయలు	29,000 - 31,000	32,000 - 35,000	33,000 - 35,000
మామిడి	33,000 - 38,000	40,000 - 42,000	42,000 - 44,000
బొప్పాయి	55,000 - 60,000	60,000 - 65,000	65,000 - 67,000
డ్రాగన్ ఫ్రూట్స్	65,000 - 70,000	65,000 - 75,000	78,000 - 80,000



బ్యాంకుల్లో ప్రధానంగా ప్రభుత్వం రుణ మాఫీ ఆశలు చూపుతుండడంతో పాతవి చెల్లించి కొత్తరుణాలు తీసుకుంటే మాఫీ కావనే అనుమానంతో బ్యాంక్‌ల్లో అప్పులు కొనసాగిస్తున్నారు. దీంతో రుణాల లక్ష్యం కూడా నేరవేరడం లేదని తెలుస్తోంది.

● వడ్డీ వ్యాపారుల వైపే పరుగులు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో రుణ పరిమితి ఖరారు చేస్తున్నా రైతులు బ్యాంక్‌ల ద్వారా పూర్తి స్థాయిలో రుణాలు అందుకోలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. వ్యవసాయం కోసం రైతులకు జిల్లాలో అనుకూల పరిస్థితులు ఉన్నా ప్రైవేటు వ్యక్తుల ద్వారా రుణాలు పొందక తప్పడం లేదు.

● జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.40 లక్షల ఎకరాలు, యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. ఇందులో వానాకాలం సీజన్‌లో వరి 1.60 లక్షల ఎకరాలు, పత్తి 74 వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. యాసంగిలో వరి 1.73 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి. మరోవైపు ప్రణాళిక ఖరారు కావడంతో రైతులు రుణాలు పొందడానికి సిద్ధం అవుతున్నారు.

బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



హాజరైన వినోద్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12 : సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని బంగారు మైసమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్ ఆధ్వర్యంలో ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మాజీ ఎంపీ కరీంనగర్ పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శిగూడూరి ప్రవీణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఆకుల చిన్న, కల్లూరి లతమధు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న కొండూరు రవీందర్‌రావు

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

- కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు
- పట్టించుకోని అధికారులు
- గ్రామస్థులు ఇబ్బందులు



రుద్రంగిలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త

రుద్రంగి, ఏప్రిల్ 12 : ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయనుకుంటే అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లోని కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. గ్రామ పంచాయతీలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సరైన పాలనను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారు అడపాదడపా పల్లెలను సందర్శిస్తుండడంతో పల్లెలో పారిశుధ్యం పడకేస్తోంది. రుద్రంగి మండల కేంద్రంలోని పలు కాలనీలు కంపుకొడుతున్నాయి. పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని ప్రత్యేక అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ఏడో వార్డులో పలు కాలనీల్లో జనవాసాల మధ్య భారీగా చెత్త పేరుకుపోయింది. అలాగే రుద్రంగి యూనియన్ బ్యాంక్ పక్కన వీధిలో డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చిన మురికి నీరు రోడ్డుపైన చేరుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా వుండే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పనిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్

చందుర్తి, ఏప్రిల్ 12 : చందుర్తి మండల కేంద్రంలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. వేములవాడ నుంచి కథలాపూర్ వెళ్తుండగా చందుర్తి మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతో చేపట్టాలని నాయకులకు సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, నాయకులు బాశెట్టి బాస్కర్, తిరుపతి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం నర్సయ్య

వీర్నపల్లి, ఏప్రిల్ 12: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం నర్సయ్య కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం రైతులతో కలిసి ప్రారంభించారు. దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ శ్యామల, మహిళా సంఘం అధ్యక్షురాలు నర్సవ్వ పాల్గొన్నారు.

నేటి నుంచి కాలభైరవ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు



హనుమాన్ ఆలయంలో ఏర్పాట్లు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12:సిరిసిల్ల పట్టణంలోని గాంధీ నగర్ హనుమాన్ ఆలయంలో కాలభైరవ ప్రాణ ప్రతిష్ఠతోపాటు కలశంపూజ, కుంబాభిషేక మహో త్సవాలు శనివారం నుంచి ప్రారం భంకానున్నాయి. ఇందు కోసం ఆలయంలో కాలభైరవ గుడితో పాటు ప్రతిష్ఠ కోసం ఏర్పాట్లు శ్రీభక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయంలో శనివారం ఉదయం శాన్తిపాఠం, స్వస్తివాచనంబుత్విగ్వరణం, యాగశాల ప్రవేం దేవతాహ్వానం, గణేశ, మాతృక యోగిని, వాస్తు క్షేత్రపాలక సర్వతో భద్రమండల స్థాపన ప్రధాన కలశ స్థాపనతోపాటు అగ్ని ప్రతిష్ఠ స్థాపిత దేవతాహవనం, ఆదివారం మూల మంత్ర హవనం, సోమవారం యంత్ర ప్రతిష్ఠ విగ్రహా ప్రాణ ప్రతిష్ఠి నేత్రోన్మాలనం కార్యక్రమాలను పూజారి రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో శ్రీకాల భైరవస్వామి యంత్ర ప్రతిష్ఠవిగ్రహ ప్రతిష్ఠా చేయడం జరుగుతుందని వార్డు కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజా పూర్ణచందర్ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



పెద్దూర్‌లో ప్రమాదరకంగా ఉన్న విద్యుత్ తీగలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో పోచమ్మ గుడికి వెళ్లే ప్రాంతంతోపాటు చుట్టు పక్కల పొలాల దారిలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. సెస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన మంగ కిరణ్‌కుమార్ ఆరోపించారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరిహారం ఉత్తమాటేనా?

- కొనసాగుతున్న మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణం
- పరిహారం కోసం రైతుల ఆందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మెడికల్ కళాశాల భవనం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 12: జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలకు సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకుండానే నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. దీంతో పరిహారం చెల్లించేందాకా పనులు చేపట్టవద్దని భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేస్తున్నారు. పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని కోరినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ భయపెడుతున్నాడని, పోలీసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వే నంబరు 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వాలు భూములు లేని40 మంది నిరుపేద రైతులు పట్టాలను అందించాయి. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరవడంతో ఆ సమయంలో అధికారంలో ఉన్న మంత్రి కేటీఆర్ కలెక్టర్‌తో కలిసి 36 ఎకరాలను మెడికల్ కళాశాలకు సేకరించారు. తమ భూములను తీసుకోవద్దని బాధిత రైతులు ఆందోళనలు చేశారు. పలుమార్లు కేటీఆర్ వారితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తీసుకున్న భూములకు బదులు వాణిజ్య వ్యాపారాలు చేసుకుందుకు ప్రతీ ఒక్కరికి 800 గజాల నుంచి 1000 గజాల వరకు స్థలంతోపాటు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. నమ్మిన రైతులు మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుమతులు ఇస్తూ సంతకాలు చేశారు. గత ప్రభుత్వం ఆఘమేఘాల మీదా కళాశాల భవనాన్ని నిర్మించింది. గతేడాది మాజీ సీఎం కేసీఆర్ ఆన్ లైన్‌లో కళాశాలను ప్రారంభించారు. పరిహారంతోపాటు స్థలాలను ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్‌తోపాటు కేటీఆర్ చుట్టూ తిరిగిన స్పందన లేకుండా పోయింది. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మిగిలిన భూముల్లో అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని రైతులు నిర్ణయించకున్నారు. ఫిబ్రవరి 7వ తేదీన కాంట్రాక్టర్ అదనపు భవన నిర్మాణాల పనులను ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడి చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఆందోళనకు దిగడంతో పనులను నిలిపివేశారు. కలెక్టర్ స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించారు. అప్పటి ఆర్డీవో రైతులతో మాట్లాడి మరోచోట స్థలం అందిస్తామని చెప్పి ఆ భూములను సర్వేలు చేయించారు. నమ్మిన రైతులు పనులను అడ్డుకోకపోవడంతో కాంట్రాక్టర్ పనులల్లో వేగం పెంచారు. అయితే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్డీవో బదిలీపై వెళ్లిపోవడంతో కొత్తగా వచ్చిన ఆర్డీవో ఈ సమస్యను పట్టించుకోక పోవడంతో ఆందోళన చెందిన రైతులు నాలుగు రోజుల నుంచి మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు రైతులపై దాడి చేయడంతో న్యాయం కావాలంటూ రైతులు ఆందోళనలు చేపట్టారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆర్డీవో వద్ద సమస్య పరిష్కరించుకోవాలని టౌన్ సీఐ రఘుపతి సూచించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



అదనపు భవనాల నిర్మాణం



నిర్మాణాలను అడ్డుకుంటున్న రైతులు

న్యాయం జరిగే వరకు పోరాటం



- సలేంద్రి బాలరాజుయాదవ్, పెద్దూర్

నిరుపేదలమైన మాకు జీవనోపాధికోసం గత ప్రభుత్వాలు ఇచ్చిన భూములను మెడికల్‌కళాశాల కోసం మాజీ మంత్రి కేటీఆర్ హామీ మేరకు ఇచ్చాం. భూములకు బదులు వెయ్యిగజాల స్థలంతోపాటు పరిహారం అందిస్తామని నమ్మించారు. సంతకాలు తీసుకొని మోసం చేశారు. ఎలాంటి ఉపాధిలేకపోవడంతో గొర్రెల మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తాం.

నమ్మించి మోసం చేశారు



- ఉలిసె తిరుపతి, పెద్దూర్

పెద్దూర్ శివారులో సర్వే నంబర్‌లో ఉన్న మా భూములకు నష్టపరిహారంతోపాటు వెయ్యి గజాల స్థలాన్ని అందిస్తామని చెప్పడంతో మా భూములను మెడికల్ కళాశాలకు ఇచ్చాం. అందులో భవనాలను నిర్మిస్తున్నా మాకు న్యాయం చేయడంలేదు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగించడంతోపాటు నిర్మాణాలను అడ్డుకుంటాం, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం న్యాయం చేయాలి.





పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్ట్‌మార్టం

మానకొండూర్, ఏప్రిల్ 12: మండలంలోని లింగాపూర్ గ్రామంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించి పోలీసులు పోస్ట్‌మార్టం చేయించారు. వివరాలిలా ఉన్నాయి. లింగాపూర్ గ్రామానికి చెందిన బట్టూరి సంపత్‌కుమార్ (34) పిల్లలు పుట్టడం లేదని ఈ నెల 10న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని పోలీసులకు తెలుపకుండా 11న మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. ఈ సమాచారం పోలీసులకు అందింది. దీంతో శుక్రవారం పోలీసులు గ్రామానికి చేరుకుని సంపత్‌కుమార్ కుటుంబసభ్యులను విచారించారు. సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారించుకుని పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించారు. అక్కడికే వైద్య సిబ్బందిని తీసుకొచ్చి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం మళ్లీ మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. సంపత్‌కమార్ తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 12: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన పూదరి రామయ్య(56) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రామయ్య తన నూతన ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలు అప్పు చేశాడు. దీనికి తోడు అనారోగ్యకారణాలతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా అప్పు ఎలా తీర్చాలని మన స్తాపం చెందుతున్నాడు. ఈనేపథ్యంలో గురువారం పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న బంధువులు రామయ్యను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ . పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. రామయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలి పారు.

నకిలీ ఉద్యోగ నియామక పత్రం

అవాక్కయిన వైద్యుడు..పోలీసులకు ఫిర్యాదు

కోరుట్ల, ఏప్రిల్ 12: నకిలీ ఉద్యోగ నియామక పత్రం చూసి ఓ వైద్యుడు అవాక్కయ్యాడు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఉద్యోగ నియామక పత్రం ఎక్కడి నుంచి వచ్చిందని డ్యూటీలో ఉన్న వైద్యుడు తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. అది నకిలీదిగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగ నియామక ప్రతం జిల్లా వైద్యాధికారి పేరుతో కూడిన జాయినింగ్ లేఖను పట్టణానికి చెందిన ఓ మహి ళ శుక్రవారం ఉదయం డ్యూటీలో ఉన్న వైద్యుడు అనిల్‌కు అందించింది. వైద్యుడికి అనుమానం వచ్చి జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులకు విషయం తెలిపాడు. దీం తో వారు ఎవరికీ ఎలాంటి ఉద్యోగ నియామక పత్రం అందించలేదని అది నకిలీదని తెలపడంతో వైద్యుడు అనిల్ స్థానిక పోలీ సులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చేరుకుని సంబంధిత మహిళ వద్ద ఉన్న సర్టిపికెట్లను స్వాధీనం చేసు కుని మహిళను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న కథలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యా యుడు డబ్బులు తీసుకుని నకిలీ ఉద్యోగ నియామక పత్రం ఇచ్చినట్లుగా మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆ కోణం లో విచారణ చేపట్టాడు. సదరు వ్యక్తి ఇంకా ఎంతమందికి ఇలాంటి నకిలీ నియమక పత్రాలను ఇచ్చాడో వివరాలు రాబడుతున్నారు.

ఎల్‌ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు


తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మండలంలోని ఎల్‌ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగం పై కేసు నమోదు చేశారు. కాలనీలో గల జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు జీతాలు దుర్వినియోగంపై ఎల్‌ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 6న పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.తిరుమలతో పాటు ఆమె భర్త కె.రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. తన సంతాకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు బిల్లులు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని, అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్ 12 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన మోటం సాయిల్ (58) అనే వృద్ధుడు మద్యానికి బానిసై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సాయిల్ ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులతో తరుచుగా గొడవ పడేవాడు. దీంతో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని మందలించారు. దీంతో మద్యం మత్తులో సాయిల్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయిల్ కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.













రైతులకు బోనస్ ఇవ్వకుంటే ఊరుకోం

- ఢిల్లీకి పంపడానికి మాత్రం పైసలు ఉంటాయా
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్


సంకెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న బండి సంజయ్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 12 : 'ఢిల్లీకి పంపడానికి కాంగ్రెస్‌కు పైసలుంటాయ్.. అభ్యర్థులకు డబ్బులు పంపడానికి పైసలుంటాయ్ కానీ రైతులకు బోనస్ ఇవ్వడానికి మాత్రం పైసల్ ఉండవు' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. స్థానిక రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యం తీసుకొచ్చి పది రోజులవుతోందని, ఇప్పటికీ కొనడం లేదని, తాలు, తరుగు, తేమ పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల చొప్పున కోత విధిస్తున్నారని రైతులు బండి సంజయ్ ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పరిహారం ఇవ్వడం లేదని, పంట చేతికి వచ్చాక కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే సకాలంలో కొనుగోలు చేయకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల మేరకు కోత విధిస్తున్నారని, రైతులను దోచుకుంటున్నా పట్టించుకునే వారు లేరని అన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపుతున్నట్లు, తాలు, తేమ, తరుగు విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ల ముందు దోపిడీ జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను డిఫాల్టర్‌లుగా మార్చి రూ.3 లక్షల వడ్డీలేని రుణం ఎలా అందిస్తారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో పెనం మీద ఉన్న రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పొయ్యిలో పడినట్లయ్యిందన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా ఉందని, పార్టీలు, ప్రభుత్వాలు మారినా వారి బతుకుల్లో మార్పు రావడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో లేనిపోని హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని, ప్రజలను మోసానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 12 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క ధాన్యపుగింజ కూడా కొనలేదని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్లలో 259 కేంద్రాలు ప్రారంభించారని, కొనుగోళ్లు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 10 రోజులుగా ఎదురుచూస్తున్నారని, కొనే నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం అకాల వర్షాలకు దెబ్బతింటుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, తరుగు, తాలు, తేమ పేరుతో క్వింటాల్‌కు 7 కిలోల కోత విధిస్తే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో కొంత ధాన్యం మిల్లుల వద్దకు వెళ్లాక మిగిలిన ధాన్యంలో తరుగు పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారన్నారు. జనగామలో క్వింటాల్ ధాన్యంకు రూ.1500 నుంచి రూ. 1700కు కొనుగోలు చేస్తూ ఒక్కో క్వింటాల్‌కు రూ.700 నుంచి రూ.800 వరకు నష్టం కలిగిస్తున్నారని అన్నారు. కనీస మద్దతు ధరకు గండికొడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించి ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పి, వేలాది ఎకరాలు అకాల వర్షాలకు నష్టపోతే నయాపైసా సహాయం చేయలేదని అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి చేయకపోగా కొత్తగా రైతులకు రుణాలు ఇస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ఉన్న రుణమే మాఫీ కాకపోతే కొత్త రుణం ఎలా ఇస్తారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని, రూ. 2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే ఇక్కడున్న మంత్రి తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. తాను అధికారంలోనే లేనని, అవినీతికి ఎలా పాల్పడుతానని అన్నారు. అధికారంలో ఉంది మీరేనని, దమ్ముంటే విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా పర్వలేదని, ఇకపై పనికిమాలిన గాలిమాటలు మానుకోవాలని రైతులపై దృష్టిసారించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు తదితరులు ఉన్నారు

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 12: మండలంలోని మల్యాల, వాగోడ్డు రామన్నపల్లె గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల గ్రామానికి చెందిన రమేష్ 9,700 రూపాయల విలువ గల లిక్కర్‌ను జమ్మికుంట నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. నడిగూడ మండలానికి చెందిన మనోజ్‌కుమార్ 5,500 రూపాయల విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా వాగోడ్డు రామన్నపల్లె గ్రామ శివారులో పట్టుకొని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బావిలో పడి డిగ్రీ విద్యార్థి మృతి


కౌశిక్(ఫైల్)

వేములవాడ రూరల్, ఏప్రిల్ 12 : సిద్దిపేట వద్ద బావిలో పడి ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందగా వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మర్రిపల్లికి చెందిన రాచర్ల మల్లేశం-లక్ష్మీ దంపతుల కుమారుడు కౌశిక్ (23) గురువారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరాడు. సిద్దిపేట జిల్లా ఇమాంబాద్ వద్ద ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందాడు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని రైతు మృతి


గంగాధర్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్, 12: మండలంలోని రాఘవపేట గ్రామంలో సిలిండర్ బుడ్డిలను సరఫరా చేసే ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో రైతు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. .గ్రామానికి చెందిన మాధం గంగాధర్(32) అను రైతు గ్రామంలో పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మెట్‌పల్లికి చెందిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ బుడ్డిలను సరఫరా చేసే ఆటో ఢీకొట్టడంతో గంగాధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయాలపాలైన గంగాధర్‌ను చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి స్థానికుల సహాయంతో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మాధం గంగాధర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గంగాధర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడులు

వీణవంక, ఏప్రిల్ 12: వీణవంక మండలం కనపర్తి గ్రామ శివారులోని పేకాట శిబిరంపై పోలీస్‌లు శుక్రవారం దాడులు చేశారు. మేకల నారాయణరెడ్డి వ్యవసాయ భూమిలో కొంత మంది పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందుకున్న ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న రూ.49 వేల 760నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులుదీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవ స్థానం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూ లైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపురా సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ వంటి ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. వందలాదిమంది భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకున్న భక్తులు

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య


ప్రమీల(ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 12: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన సుల్తానాబాద్ మండలం చిన్నకలువల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శ్రావణ్ కుమార్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏరుకొండ ప్రమీల(45)కు రెండు నెలల క్రితం క్యాన్సర్ సోకగా కరీంనగర్‌లో చికిత్స పొందుతోంది. అయితే క్యాన్సర్ సోకిన తాను ఏనాటికైనా చనిపోక తప్పదని, కుటుంబ సభ్యులకు భారం కాకూడదని భావించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త మొగిలి, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెక్‌డ్యాంకు మరమ్మతులు కరువు

కోనరావుపేట, ఏప్రిల్ 12: కోనరావుపేట మండలం మరిమడ్ల అటవీ ప్రాంతంలో జలవనరుల కోసం ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం, జాలావాగు కుంట కట్ట రెండేళ్ల క్రితం వర్షాలకు కొట్టుకుపోయాయి. మరమ్మతు చేపట్టకపోవడంతో జలవనరులు వృథాగా పోతున్నాయి. భూగర్భ జలాల పెంపు, సాగునీటి సౌకర్యార్థంతోపాటు వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు నిర్మాణాలను చేపట్టారు. అటవీ ప్రాంతంలోని గరక ఒర్రెలో చేపట్టిన చెక్ డ్యాం, జాలవాగు నీరు ఆపడానికి ఏర్పాటు చేసిన కుంట కట్ట రెండు సంవత్సరాల క్రితం


కొట్టుకు పోయిన మరిమడ్ల జాలవాగు కుంటకట్ట


కొట్టుకపోయిన చెక్ డ్యాం

భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి మరమ్మతు చేపట్టకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా వన్యప్రాణుల దాహార్తి తీర్చు కోవడానికి ఇబ్బందిగా మారింది. వేసవిలో అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతో వన్యప్రాణులు జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. నీటి వనరులను కాపాడడానికి నిధులు మంజూరు చేసి అటవీ ప్రాంతంలో కొట్టుకుపోయిన చెక్ డ్యామ్‌కు, కొట్టుకపోయిన జాల వాగు కుంట కట్టకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ తెరపైకి 'నిజాం షుగర్స్'

- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా మారిన ఎన్‌డీఎస్ఎల్
- గెలుపోటములపై ప్రభావం చూపే స్థాయిలో చెరుకు రైతులు
- కలగా మిగులుతున్న చక్కర కర్మాగారం పునరుద్ధరణ


జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కర కర్మాగారం

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో నిజాం షుగర్స్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతినిత్యం ఒకరిపై ఒకరు ఆరోపణలు... ప్రత్యారోపణలు చేసుకునే ప్రధాన రాజకీయ పక్షాల్లో సైతం నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) వ్యవహారంలో ఒక్కటిగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్, పసుపు బోర్డు వ్యవహారం రాజకీయ పార్టీలకు ప్రధాన అస్త్రంగా మారిన విధంగానే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఎన్‌డీఎస్ఎల్ చర్చల్లోకి వస్తోంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ రాజకీయ పక్షాలు ఎన్‌డీఎస్ఎల్ అంశంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో చెరుకు రైతులను ఆకర్షించడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నాయి. ఆ యా పార్టీలకు చెందిన హేమా హేమీల నోట ఇటీవల ఎన్‌డీఎస్ఎల్ మాటలు వచ్చాయి. పసుపు బోర్డు ఏర్పాటు వ్యవహారం, నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ లో నెలకొన్న సంక్షోభం ప్రస్తుత ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధానంగా ప్రభావం చూపనుంది. దీంతో చెరుకు రైతుల చుట్టూ రాజకీయం చోటుచేసుకుంటోంది. చెరుకు రైతులను ప్రసన్నం చేసుకోవడానికి అటు ప్రతి పక్ష పార్టీలు, ఇటు అధికార పక్ష పార్టీ వ్యూహ రచనలు చేస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డీఎస్ఎల్ అంశాన్ని ప్రచార అస్త్రంగా రాజకీయ పక్షాలు వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

1937లో నిర్మాణం..

నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని శక్కర్‌నగర్‌లో 1937లో అప్పటి నిజాం నవాబ్ నిజాం షుగర్స్ కర్మాగారాన్ని నిర్మించారు. 1979-80లో కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి, మెదక్ జిల్లా ముంబోజుపల్లి, జహీరాబాద్‌లలో నిజాం షుగర్స్ కర్మాగారాలను నిర్మించారు. 2002 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కర్మాగారాలను నష్టాల కారణంగా ఉమ్మడి యాజమాన్యం కిందకు తెచ్చింది. 2002 అక్టోబర్ 31వ తేదిన ఆంధ్రాప్రాంతానికి చెందిన డేల్టా కంపెనీకి ఉమ్మడి యాజమాన్యం కింద అప్పగించింది. అప్పటి నుంచి నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. 2015 డిసెంబర్ 22 లేఆఫ్ ప్రకటించిన ప్రైవేటు యాజమాన్యం కర్మాగారాలకు సంకెళ్లు వేయడంతో ఇప్పటి వరకు తెరుచుకోలేదు. ప్రస్తుత ఎన్నికల్లో రాజకీయ పక్షాలు చెరుకు రైతుల ప్రయోజనాల ప్రాధాన్యతే ఎజెండాగా ముందుకు వెళ్తుండడంతో రైతు చుట్టూ రాజకీయం నడుస్తున్నట్లయిందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

హేమా హేమీల నోట..

జగిత్యాలలో గత నెల 18వ తేదీన ఎన్నికల ప్రచార విజయ సంకల్ప సభను నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ నిజాం దక్కన్ షుగర్ కర్మాగారాన్ని ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తెరిపించలేకపోయాయని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు సందర్భాల్లో ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణ బీజేపీతోనే సాధ్యమవుతుందని అంటున్నారు. ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఎన్‌డీఎస్ఎల్ కర్మాగారాలను వచ్చే యేడాది పునరుద్ధరిస్తామని హామీనిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించామని వివరిస్తున్నారు. బీఆర్ఎస్ సైతం ఎన్‌డీఎస్ ఎల్‌పై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెరుకు రైతులను ఆదుకుంటామని, అధికారంలోకి వచ్చిన వెంటనే జగిత్యాల జిల్లా ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి నిజాందక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపిస్తామని రైతులకు హామీనిచ్చారు. అన్నదాతలను ఆకర్షించడానికి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు వ్యూహాన్ని రచిస్తున్నాయి.

ముగిసిన రెండో విడత జేఈఈ మెయిన్స్


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఈ నెల 4న ప్రారంభమైన రెండో విడత జేఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామిషన్) మెయిన్స్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు 124 మంది గైర్హాజరు అయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలిత కుమారి తెలిపారు. జేఈఈ పరీక్షలు ఈ నెల 4న ప్రారంభమయ్యాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఈ సెషన్‌లో 311 మందికి గానూ 187 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఫైల్‌నంబరు: 01ఈడీకే12

హంస వాహనంపై స్వామివారల విహారం


హంస వాహనంపై విహరిస్తున్న శ్రీ స్వామి వారు

వేములవాడ, ఏప్రిల్ 12: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పార్వతీరాజరాజేశ్వర స్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు శుక్రవారం హంస వాహనంపై విహరించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల నాలుగో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామికి ఉపనిషత్ ద్వారాభిషేకము, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి అందంగా అలంకరించిన హంస వాహనంపై పట్టణ వీధుల మీదుగా స్వామివారలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని రాఘవపూర్ గ్రామం వద్ద లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన బొజ్జ ప్రశాంత్ (25) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటాడు. శుక్రవారం తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తుండగా రాఘవపూర్ వద్ద వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

లింగంపేటలో కరెంట్ మోటర్ల చోరీలు

- ఆందోళనలో రైతులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 12: జగిత్యాల పట్టణంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా గుర్తు తెలియని దొంగలు విద్యుత్ కరెంటు మోటార్లను టార్గెట్‌గా చేసుకుని అపహరించుకవెలుతున్నారు. ఇప్పటికే లింగంపేటకు చెందిన ఎడ్మల సహదేవ్, సిరికొండ ధర్మయ్య, సరగల్ల ప్రశాంత్‌లకు చెందిన వ్యవసాయ మోటార్లను దొంగలు అపహరించుకవెళ్లారు. తాజాగా దొంగ ధర్మరాజుకు చెందిన వ్యవసాయ మోటారును అపహరించుకవెళడంతో సాగు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికోచ్చే సమయంలో వరుసగా విద్యుత్ మోటార్లు చోరీకి గురికావడం పట్ల రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు. అంతే కాకుండా ఎలుకబావి వాడలో నూతనంగా నిర్మించిన ఓ గృహం వద్ద బోరు మోటారును అపహరించుకువెళ్లారు. దీంతో రైతులతో పాటు ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు నైట్ బీట్లను మరింత పెంచి దొంగతనాలు జరుగకుండా అరికట్టాలని కోరుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ధర్మపురి, ఏప్రిల్ 12: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సీఐఎస్ఎఫ్ కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక పటేల్ చౌరస్తా, గాంధీచౌక్, నందిచౌక్, కమలాపూర్ చౌరస్తా మీదుగా ఎస్‌హెచ్ గార్డెన్స్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం అధికంగా పెంచడం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఆయన అన్నారు. సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ యోగిందర్ సింగ్ మాట్లాడుతూ ఓటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడరాదని అన్నారు. అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని అన్నారు. అంతకు ముందు ఫ్లాగ్‌మార్చ్ సందర్భంగా పలువురు మహిళలు, యువకులు, విద్యార్థులు పూలు చల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రవీంద్రకుమార్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, ఆర్ఐ వేణు, ఆర్ఎస్ఐలు మారుతి, సుమన్, సీఐఎస్ఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఫ్లాగ్‌మార్చ్ ప్రారంభిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన సెస్ చైర్మన్



అజ్మతుల్లా హుస్సేనిని కలిసిన సెస్ చైర్మన్ రామారావు

గంభీరావుపేట, ఏప్రిల్ 12 : గంభీరావుపేట మండల కేంద్రంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కలిశారు. రంజాన్ సందర్భంగా గంభీరావుపేటకు వచ్చిన అజ్మతుల్లా హుస్సేనీని శుక్రవారం కలిసిశుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, బీఆర్ఎస్ నాయకులు రాజారాం, సుభాష్, కమలాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

● గంభీరావుపేట మండల కేంద్రంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని జిల్లా కాంగ్రెస్ నేతలు శుక్రవారం కలిసారు. సీఎం రేవంత్‌రెడ్డి టీమ్ జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్, నాయకులు పాతూరి భూపాల్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, బండ రమేష్, కిరణ్, శ్రావన్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహుస్సేన్‌ను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్‌కు చెందిన ముస్లిం కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం గంభీరావుపేటలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా, ఖబ్రస్థాన్‌లకు స్థలం కేటాయించాలని, నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం కమిటీ సభ్యులు విన్నవించారు. ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అజ్మతుల్లాహుస్సేన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, నాయకులు బాల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కిరణ్, శ్రావణ్, జహంగీర్, లాల్‌మహ్మద్, రఫీక్, ఇర్ఫాన్, ఖాలీద్, అశ్వక్, సల్మాన్, ఇంత్యాజ్, అస్లాం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలి వేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ లావణ్య

చందుర్తి, ఏప్రిల్ 12 : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో బైరగోని సత్తవ్వ-సాయాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ బైరగోని లావణ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో రైతులకు, ప్రయాణికులకు, ప్రజలకు దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి బైరగోని రమేష్ గౌడ్, నాయకులు సంపునూరి దశరథం, ముత్యాల నరేష్, గుర్రం దేవయ్య కొత్త ఎల్లారెడ్డి, లక్ష్మీనరసయ్య, పెరక రాజయ్య, ఎర్రం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారుల బారినపడి నష్టపోతున్నరైతులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12: రైతులు దళారుల బారినపడి నష్టపోతున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు మ్యాకల మల్లేశం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకం వేయడం లేదన్నారు. ఈ సారి కొత్తగా ఐరీష్ విధానం అమలు చేస్తుండడంతో కొంత మంది రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు పడడం ఎందుకని రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి నష్టపోతున్నారన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12:ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో అంబేద్కర్ మాల సంఘం ఆధ్వర్యంలో శివాలయంలో విగ్రహ ప్రాణప్రతి ష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు విశ్వనాథశర్మ, శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలోని పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. అంబేద్కర్ మాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీ వరసిద్ధి గణపతి ప్రాణ ప్రతిష్ఠాపన..

ముస్తాబాద్, ఏప్రిల్ 12: ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలోని శ్రీ వీరాజంనేయ స్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మీ వరసిద్ధిగణతి, నవగ్రహా విగ్రహా ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పురోహితులు ఉదయం విగ్రహాస్నాపనం, మంటప పూజ, హోమం తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహస్థాపనం, బలిహారణం, పూర్ణహరాతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాన్ని శుక్రవారం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉదయం, వల్లంపట్ల గ్రామంలో సాయంత్రం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అంబేద్కర్ మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య, యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సావనపల్లి రాకేష్, సీనియర్ నాయకులు గన్నేరం నర్సయ్య, పసుల వెంకటి, మచ్చ రాజేశం, సావనపల్లి శంకర్, మల్లమారి బాబు, దమ్మని మధు, బట్టు బాబు, మచ్చ కుమార్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా రక్షణ చర్యలు

- నాంపల్లి గుట్టపై ప్రమాదకరంగా ఘాటు రోడ్డు
- కొంత వరకే క్రష్ బెరియన్స్ ఏర్పాటు
- పూర్తి స్థాయిలో చేపట్టాలని భక్తుల విజ్ఞప్తి



నాంపల్లి గుట్టపై ప్రమాదకరంగా ఘాటు రోడ్డు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 12: వేములవాడ నాంపల్లి లక్ష్మీనృసింహాస్వామి గుట్టపైకి వెళ్లే ఘాటు రోడ్డులో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో రెండున్న కిలోమీటర్ల దూరంలో ఉన్న నాంపల్లి లక్ష్మీనృసింహాస్వామి గుట్టకు వెళ్లి స్వామివారిని దర్శిం చుకుంటారు. నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. స్వామివారిని చేరుకోవాలంటే ఘాటు రోడ్డు మార్గాన ప్రయాణించాల్సి ఉంటుంది. గుట్టపైకి వెళ్లేందుకు, దిగేందుకు వన్‌వే మాత్రమే ఉండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపుతప్పితే ప్రమాదాలు చోటు చేసుకోకుండా రాజన్న ఆలయ అధికారులు గుట్టపైన ఘాటు రోడ్డుకు లోయలవైపున రక్షణ చర్యలు చేపట్టారు. సుమారు రూ.15 లక్షల విలువగల క్రష్‌బెరియన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు. క్రష్‌బెరియర్స్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. గుట్టపై నుంచి కింద వరకు క్రష్‌బెరియన్స్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గుట్టపైన నుంచి కిందకు వాహనాలు వచ్చే సమయంలో రోడ్డు ఏటవాలుగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సగ బాగం మాత్రమే క్రష్‌బెరియన్స్ ఏర్పాటు చేశారని, పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



సగ భాగం ఏర్పాటు చేసిన క్రష్ బెరియన్స్

పూర్తిస్థాయిలో క్రష్ బెరియన్స్ ఏర్పాటు చేయాలి

- చిర్రం శేఖర్, నాంపల్లి



నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం వెళ్లాలంటే ఘాటు రోడ్డుపై ప్రయాణం చేయాలి. దీంతో భక్తులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. కొంత భాగం క్రష్ బెరియన్స్ ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తాం

- నరేందర్, నాంపల్లి గుట్ట ఇన్‌చార్జి అధికారి

నాంపల్లి గుట్టపైకి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఘాటు రోడ్డు ప్రమాదకరంగా ఉండటంతో మొదటి విడతలో సుమారు రూ.15 లక్షలతో క్రష్‌బెరియన్స్‌ను సగభాగం వరకు ఏర్పాటు చేశాం. రెండో విడతలో మరో రూ.15 లక్షల ఎస్టీమేషన్‌తో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు వేశాం. త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

బయటపడుతున్న బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12: పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు వంద మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కేకే మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించారని, అధికారం కోల్పోగానే పొలం బాట పేరిట పంట పొలాలను సందర్శిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ పొలాలను పరిశీలించడం చేతకానితనంగా భావిస్తున్నామన్నారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తాను డబ్బులు, మందు పంచనని శపథం చేశారని, ఎన్నికల సమయంలో డబ్బులు వాహనాల్లో తరలించామని ఫోన్ ట్యాపింగ్‌లో ఇంటెలిజెన్స్ అధికారి విచారణలో అంగీకరించడం కేటీఆర్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ సర్కారు ఎకరాకు రూ.10 వేలు ప్రకటించినా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం అవివేకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. దుమాల, రాగట్లపల్లి బీఆర్ఎస్ మాజీ సర్పంచుల భర్తలు కదిరే శ్రీనివాస్, దాసరి మహేందర్, మండల కేంద్రంలోని శ్వేత మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మేగి దేవయ్యతోపాటు సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్మారెడ్డి, నాయకులు లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రవి, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, యువత శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఉమ్మడి ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు జజ్జరి నాగరాజు, వార్డు సభ్యులు రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం, మాలోతు అనిల్, కురుమ సంఘం నాయకులు శ్రీబాబు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోతు రాజు నాయక్, ఉత్తం అంజయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతి యాదవ్, సీనియర్ నాయకులు కాంతయ్య, గజన్ లాల్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

జాతీయ మానవహక్కుల కమిటీ మండల అధ్యక్షుడిగా నిరంజన్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12: జాతీయ మానవహక్కుల కమిటీ మండల అధ్యక్షుడిగా సాదుల నిరంజన్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అన్నాడి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వడ్డిక అనీల్‌రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

బీజేపీలోకి పోతారం మాజీ సర్పంచ్

కథలాపూర్, ఏప్రిల్ 12 : మండలంలోని పోతారం తాజా మాజీ సర్పంచ్ ధర్మపురి జలంధర్ సహా 50 మంది శుక్రవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీజేపీలో చేరుతున్నామని ప్రకటించారు. మాజీ సర్పంచ్ జలంధర్, ఆలయ కమిటీ చైర్మన్ యాటకార్ల అశోక్ కొంత కాలంగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు, ప్రతాపరామకృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, కంటె సత్యనారాయణ, రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, గంద్ర అజయ్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, వినోద్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి ఉన్నారు.

సీనియర్ కార్యకర్తలపై చిన్నచూపు తగదు

బీర్‌పూర్, ఏప్రిల్ 12: ఇటీవల ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి సీనియర్ కార్యకర్తలను చిన్నచూపు చూడటం తగదని ఇది సరైన పద్ధతి కాదని మండల బీజేపీ సీనియర్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బోరే నగేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో పార్టీకి ఎలాంటి గుర్తింపు లేనప్పుడు పార్టీని పట్టుకొని ఎన్ని అవమానాలెదురైనా ముందుకు వెళ్లి పార్టీకి ఒక గుర్తింపు తెచ్చామన్నారు. ఇప్పుడు పార్టీ అధిస్థానం సీనియర్ కార్యకర్తలమైన తమను గుర్తించక పోవడం బాధాకరమన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన వారు కేవలం పదవుల కోసమే కండువాలను కప్పుకున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు మండలంలో జరుగుతున్న నియంత పాలన ను గుర్తించి కష్టపడి పార్టీకోసం పని చేసే వారికే బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఆయన వెంట మల్లేశం, చిన్నయ్య, తిరుపతి, సంతోష్, రవి, రఘువీర్ రెడ్డి, అర్జున్, రాజన్న, నాయ క్, నరేష్ నాయక్, సుధాకర్ ఉన్నారు.

క్యాన్సర్‌తో బాలుడి మృతి

చందుర్తి, ఏప్రిల్ 12 : చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో క్యాన్సర్‌తో ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మ్యాకల శ్యామల - శంకర్ దంపతుల కుమారుడు మణిదీప్ (11) కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఈ నెల 11న హైదరాబాద్‌కు వెళ్లాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి జీవనోపాధి కోసం బెహరస్ వెళ్లగా కుమారుడి మరణ వార్త విని స్వగ్రామానికి బయల్దేరినట్లు గ్రామస్థులు తెలిపారు.

అభివృద్ధి పనులపై చర్చకు రావాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 12 : కరీంనగర్ ఎంపీగా గతంలో పొన్నం ప్రభాకర్, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులపై కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద రాణిరుద్రమ చర్చకు రావాలని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కామిని వనిత సవాల్ విసిరారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా గెలిచిన నాటి నుంచి బండి సంజయ్‌కుమార్ సిరిసిల్లకు ఎన్నిసార్లు వచ్చారో వేళ్ల మీద లెక్కించవచ్చన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై శ్వేత పత్రం విడదల చేయాలని రాణి రుద్రమ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ సిలిండర్, ఐదెకరాలలోపు రైతులకు రైతు బంధు అందిస్తోంది రాణి రుద్రమకు కనబడడం లేదా? అని అన్నారు. నాడు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ఏకమై సిరిసిల్లకు రావాల్సిన టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్‌ను వరంగల్‌కు తీసుకెళ్లాయని ఆరోపించారు. ఎంపీగా నాడు పొన్నం ప్రభాకర్ సిరిసిల్లకు కేంద్రీయ విద్యాలయం, బీడీ కార్మికుల కోసం వేములవాడ నాంపెల్లిలో ఆసుపత్రి, ఉమ్మడి జిల్లా ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని కరీంనగర్‌లో పాస్‌పోర్టు కార్యాలయం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఎంపీగా సంజయ్‌కుమార్ చేసిన పనులపై రాణిరుద్రమ పుస్తకం విడదల చేస్తే పొన్నం ప్రభాకర్ ఎంపీగా చేసిన అభివృద్ధి పనులపై తాము పుస్తకం విడదల చేస్తామన్నారు. సిరిసిల్ల గాంధీచౌక్ వద్ద పొన్నం ప్రభాకర్, బండి సంజయ్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులపై చర్చకు మేం సిద్ధమన్నారు. సమావేశంలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వనిత

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 12 : మండలంలోని మారుతినగర్ శివారులోని పెద్దగుండు వద్ద రెండు ద్విచక్రవాహనాలు శుక్రవారం రాత్రి ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లి పట్టణానికి చెందిన మీర్జా ఖాజాపాషా తన ఇద్దరు కూతుర్లు అయోషా, అలీషాలతో కలిసి తన దిచక్రవాహనంపై కోరుట్లకు వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి మెట్‌పల్లి పట్టణానికి బయలు దేరారు. అదే సమయంలో కోరుట్ల పట్టణానికి చెందిన తొగిటి వెంకటేష్, ఇల్లెందుల శ్రీనివాస్‌లు మెట్‌పల్లి పట్టణానికి వచ్చి తిరిగి కోరుట్లకు వారి ద్విచక్రవాహనంపై బయలు దేరారు. ఈ క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు మారుతినగర్ శివారులోని పెద్ద గుండు వద్ద ఢీకొన్నాయి. దీంతో అక్కడికక్కడే మెట్‌పల్లి పట్టణానికి చెందిన మీర్జా ఖాజాబాయ్(38), కోరుట్ల పట్టణానికి చెందిన తొగిటి వెంకటేష్(28) అను ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు అయోషా, అలీషా, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాల పాలయ్యారు. అటువైపు వెళ్లుతున్న ప్రయాణికులు గమనించి పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలంకు ఎస్సై చిరంజీవి పరిశీలించి మృతులను కోరుట్ల ఆసుపత్రికి, గాయాలపాలైన వారిని చికిత్స కోసం మెట్‌పల్లి ఆసపత్రికి తరలించారు.



మీర్జా ఖాజాపాషా.. వెంకటేష్ (ఫైల్ ఫొటోలు)

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 12 : దేవుని మాన్యాలను కబ్జా చేసిన భూకబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లోని సర్వే నెంబర్ 1563లో విశ్వనాథ దేవాలయంకు చెందిన 22 గుంటల భూమి ఉందన్నారు. 22 గుంటల్లో మూడు గుంటల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. మార్చి 18వ తేదిన సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చేసిన పిర్యాదు మేరకు ఎండోమెంట్, రెవెన్యూ సర్వేయర్లు సర్వే చేసి మూడు గుంటల భూమి కబ్జాకు గురైన విషయాన్ని గుర్తించి హద్దులు వేశారని అన్నారు. ఎండోమెంట్, రెవెన్యూ సర్వేర్లు ఉమ్మడిగా పంచనామా రిపోర్టు ఇవ్వాల్సి ఉండగా దాన్ని బైపాస్ చేసి రెవెన్యూ జిల్లా సర్వేరైనా ఏడీ శ్రీనివాస్ పంచనామా రిపోర్టును ఇస్తానని 15 రోజులు కాలయాపన చేసి ఏప్రిల్ 8వ తేదిన విశ్వనాథ దేవాలయం పేరు మీద కేవలం 19 గుంటలు మాత్రమే ఉందని పంచనామా రిపోర్టు ఇవ్వడం జరిగిందన్నారు. సర్వేలో ఎండోమెంట్ సర్వేయర్‌లు పాల్గొన్న రెవెన్యూ జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్ 19 గుంటల భూమి మాత్రమే ఉందని పంచనామ రిపోర్టు ఇవ్వడం వెనకాల కబ్జాదారులను కాపాడటానికి యత్నిస్తున్నట్లు అనుమానాలను వ్యక్తం చేశారు. దేవుని మాన్యాలను పట్టపగలు రెవెన్యూ అధికారుల సహకారంతో కబ్జాదారులు కొల్లగొడుతున్నారని అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వనాథ దేవాలయం భూమి పక్కన ఉన్న 27 ఫీట్ల రోడ్డును 40 ఫీట్లు ఉన్నట్లుగా కాగితాల మీది రాసి ఇస్తే మోక మీదికి వచ్చి చూడకుండా సిరిసిల్ల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ లే అవుట్ అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అన్సారీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 10 సంవత్సరాలుగా తిష్ట వేసిన అధికార అన్సారీ సిరిసిల్ల లే అవుట్ వ్యవస్థనే ధ్వంసం చేయడానికి పూనుకున్న వారిలో ఒక్కడని ఆరోపించారు. ఇలాంటి మున్సిపల్ అధికారులతోనే అక్రమాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. సర్వేలో కేవలం రెండు ఫీట్ల నాల ఉన్నట్లు, 40 ఫీట్ల రోడ్డుకు మద్దతునివ్వడానికి జిల్లా సర్వేయర్ ఏడి పూనుకున్నట్లు తాము బావిస్తున్నామని అన్నారు. దేవుని భూములను కాపాడు కోవడం కోసం రాజకీయాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా పోరాడుతామన్నారు. పట్టపగలు దేవుని భూములను కబ్జా చేస్తుంటే ప్రభుత్వం నిద్ర మత్తులో ఉందని ఆరోపించారు. సర్వే నెబర్ 1581లో రెండు ఎకరాల 10 గంటల ప్రభుత్వ భూమి ఉందని ఇది కోట్లాది రూపాయాల విలువైన భూములను భూ కబ్జాదారులు దీన్ని కూడా కబ్జా చేస్తుంటే ప్రభుత్వం వారిపై ఎందుకు చర్యలు తీసుకుంటలేదో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ బహిరంగంగా ప్రకటన చేయకుంటే అఖిల పక్షం ఆధ్వర్యంలో భూ కబ్జాదారులను జైలుకు పంపించేంత వరకు పోరాటాలు చేస్తామమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు సోమ నాగరాజు, అజ్జ వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 12: సిరిసిల్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి రాష్ట్ర జౌళిశాఖ మంత్రి కేటీఆర్ బతుకమ్మ చీరల బకాయిల చెల్లింపుల కోసం టోకన్లు ఇచ్చి ఎగనామం బెట్టినందుకు కేసీఆర్, కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తిదారులకు, కార్మికులకు, పద్మశాలి సామాజిక వర్గంకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య మాట్లాడారు. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం సిరిసిల్లకు వచ్చి జేఏసీ నాయకులతో చర్చించినట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలోని కార్మికులకు 365 రోజులు పని కల్పించడం కోసం జేఏసీ నాయకులతో మంత్రి పొన్నం చర్చించారని, వారి సమక్షంలోనే జౌళి శాఖ డైరెక్టర్‌తో మాట్లాడారని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రాజకీయ నాయకుడిగా ఇంకా పరిణితి చెందలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి లేదా జౌళి శాఖ మంత్రి, జిల్లా మంత్రి హామీ ఇవ్వాలనడం చూస్తే అవగాహన లోపంతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖ నుంచే జౌళి శాఖకు నిధులు వెళ్తాయన్న విషయం ఆగయ్య తెలవకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రాష్ట్ర వ్యాప్తంగా నేత పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. 365 రోజులు నేత కార్మికులకు పని కల్పించాలని ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, సంబంధిత అధికారులతో అనేక సార్లు చర్చలు జరిపి బకాయిలు చెల్లించడంపై ఒక కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, జౌళిశాఖ మంత్రి చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికలకు 15 రోజుల ముందే ఇతర ప్రాజెక్టు పనుల బిల్లులు రూ. 17,000 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిందన్నారు. సిరిసిల్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి రాష్ట్ర జౌళిశాఖ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన బతుకమ్మ చీరల బకాయిల చెల్లింపుల కోసం టోకెన్లు ఇచ్చి ఎగనామం బెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే బకాయిలు ఆగిపోయాయని, కరెంట్ బిల్లుల తడిపి మోపడైయ్యాయని ఆరోపించారు. సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తిదారుల మెడపై కత్తిపెట్టి గులాబీ కండవా కప్పి ఓట్లు వేస్తేనే బిల్లులు చెల్లిస్తామని బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా సర్దుబాటు చేసుకుంటోందని, చిత్తశుద్ధితో బకాయిలను చెల్లిస్తుందని అన్నారు. వస్త్ర ఉత్పత్తిదారులను హైదరాబాద్ తీసుకెళ్లి సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి, జౌళిశాఖ మంత్రి, జిల్లా మంత్రి హామీ ఇవ్వాలనడం సరికాదన్నారు. చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వల్లే వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడం కోసం ఓ మంచి కార్యక్రమాన్ని తీసుకుంటుందని అందులో భాగంగానే మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తమ జేఏసీ సభ్యులతో సమావేశమై చర్చించారన్నారు. జౌళి శాఖ డైరెక్టర్‌ను జేఏసీ సభ్యులు కలిశారని, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వ ఆర్డర్లతోపాటు ప్రైవేటు ఆర్డర్లు దాదాపు 40 కోట్ల మీటర్లు ఉత్పత్తి చేయడానికి సానుకూలంగా స్పందించారన్నారు. శ్రీరామ నవమి వరకు బకాయిల్లో దాదాపు రూ. 150 కోట్లు చెల్లిస్తామన్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు చేసిందేమీలేదన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ నారాయణ, నాయకులు మధు, అంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్